హైదరాబాద్‌లో బీజేపీ విజయం ఖాయం


మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు పవన్‌మిశ్రా


బీజేపీని గెలిపించాలని ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసన్న


బండి సంజయ్‌ని కలిసిన దేవర శ్రీనివాస్ తదితరులు


మాట్లాడుతున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి


కరపత్రాలు అందజేస్తున్న శివకుమార్‌యాదవ్

చార్మినార్: హైదరాబాద్ లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ విజయం ఖాయమని బీజేపీ ఓబీసీ మోర్చా ఐటీ సెల్ రాష్ట్ర కన్వీనర్ పార్శ్యరసాని వెంకటేశ్ ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం పత్తర్‌గట్టి డివిజన్‌లో జరిగిన బీజేపీ కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. హైదరాబాద్‌లో ఈసారి తమ పార్టీ అభ్యర్థి మాధవీలత విజయం కోసం ఎన్నో అవకాశాలున్నాయన్నారు. మెహూరాణి, ఎం.కుమార్, నరేష్ అవస్థీ, శ్రీధర్‌యాదవ్, పవన్ మిశ్రా, వి.సత్యనారాయణ, రాయికోట్ విశాల్ పాల్గొన్నారు.

హైదరాబాద్, సికింద్రాబాద్‌లలో బీజేపీని గెలిపించాలి..

అబిడ్స్: హైదరాబాద్ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల్లో బీజేపీని గెలిపించాలని అప్పుడే గ్రేటర్ హైదరాబాద్ అన్ని రంగాల్లో నెంబర్ వన్‌గా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసన్న పేర్కొన్నారు. హైదరాబాద్‌లో 40 ఏళ్లుగా విజయం సాధించిన మజ్లిస్ పార్టీ మైనార్టీలతోపాటు ఏ వర్గం ప్రజలకు కూడా అభివృద్ధి చేయలేదన్నారు. గురువారం హైదరాబాద్, సికింద్రాబాద్ నియోజకవర్గాల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆమె విస్తృతంగా పర్యటించి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ అభ్యర్థులు మాధవీలత, కిషన్‌రెడ్డిలను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం కాట్రగడ్డ ప్రసన్న మాట్లాడుతూ..మజ్లిస్ పార్టీకి ఓటు వేయవద్దని సూచించారు.

త్వరలోనే కాంగ్రెస్ కనుమరుగు..

గోల్కొండ: తెలంగాణలో బీఆర్ఎస్‌కు పట్టిన గతే దేశంలో కాంగ్రెస్‌కు పడుతుందని బీజేపీ నాయకుడు బండి సంజయ్ అన్నారు. గుడిమల్కాపూర్‌కు చెందిన బీజేపీ రాష్ట్ర నాయకుడు గురువారం బండి సంజయ్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనతో తెలంగాణ ప్రజలు బేజారెత్తిపోయారన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు బీజేపీకి ఓటు వేయడానికి తీర్మానించుకున్నారన్నారు.

గోల్కొండ కోటపై కాషాయ జెండా ఎగరడం ఖాయం..

గౌలిపురా: ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో హైదరాబాద్ పార్లమెంట్ స్థానంలో బీజేపీ గెలుస్తుందని తద్వారా గోల్కొండ కోటపై కాషాయ జెండా ఎగరటం ఖాయమని గౌలిపురా కార్పొరేటర్ ఆలె భాగ్యలక్ష్మి అన్నారు. గురువారం గౌలిపురా డివిజన్ పటేల్‌నగర్‌లో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఇ.సుమన్‌కుమార్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌కు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ..హైదరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవీలతను గెలిపించాలన్నారు. డి.ప్రవీణ్ కుమార్, ఆర్.క్రాంతి కుమార్, జమాల్‌పూర్ చంద్రశేఖర్, ఎం.వెంకటేశ్, జి.ధీరజ్ లాల్, జి.రఘుకాంత్, కె.శ్రీనివాస్, ప్యారసాని రమేశ్, స్వామి, అల్లి మహేందర్ గిరి పాల్గొన్నారు.

బీజేపీతోనే సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్...

జియాగూడ: సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్ బీజేపీతోనే సాధ్యమవుతుందని కార్వాన్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్, గుడిమల్కాపూర్ కో ఆర్డినేటర్ బి.శివకుమార్‌యాదవ్ అన్నారు. గురువారం హైదరాబాద్ లోక్‌సభ అభ్యర్థి మాధవీలత విజయం కోసం ఇంటింటికి వెళ్లి ప్రచారం చేపట్టారు. జియాగూడ, కార్వాన్, గుడిమల్కాపూర్ డివిజన్లలో ప్రచారం నిర్వహించారు.

వేలాడుతున్న యమపాశాలు..
దారి పొడవునా మృత్యు ఘంటికలు


ఎలాంటి రక్షణ లేకుండా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

- పాతబస్తీలో ప్రమాదకరంగా ఇనుప స్తంభాలు..విద్యుత్ తీగలు
- దడ పుట్టిస్తున్న ఎల్టీ, హెచ్‌టీ విద్యుత్ వైర్లు
- అడ్డదిడ్డంగా ఏర్పాటు చేసిన వైర్లతో షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలు
- టీఎస్ఎస్‌పీడీసీఎల్–జీహెచ్ఎంసీ ఎలక్ట్రికల్ మధ్య సమన్వయ లోపం
- బహదూర్‌పురాలో విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


మృతదేహాన్ని తరలిస్తున్న పోలీసులు(ఫైల్)

చార్మినార్: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం..ప్రజాప్రతినిధులు అలసత్వంతో పాతబస్తీలో సామాన్య ప్రజల ప్రాణాలు పిట్టల్లా రాలిపోతున్నాయి. చేతికందే ఎత్తులో విద్యుత్ తీగలు, ఎలాంటి కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు, శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలతో ఎప్పుడు ఏ ప్రమాదం దూసుకొస్తోందోనని పాతబస్తీ ప్రజలు బిక్కుబిక్కుమంటూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవిస్తున్నారు. ప్రభుత్వ స్తంభాలకు ఇష్టానుసారంగా ప్రైవేటు కేబుళ్లు చుట్టలు చుడుతుండటంతో తరచూ విద్యుదాఘాతాలు సంభవించి ప్రాణాలు పోతున్నాయి. ఈ సమస్యలపై పలుమార్లు సంబంధిత అధికారులతో మొర పెట్టుకున్నా ఏ మాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మంగళవారం రాత్రి జోరుగా కురిసిన భారీ వర్షానికి బహదూర్‌పురా ప్రధాన రోడ్డులోని వీధి స్తంభానికి కరెంట్ సరఫరా జరిగింది. ఇది తెలియని ఓ బాటసారి అటువైపు నుంచి వెళ్తుండగా.. ప్రమాదావశాత్తు విద్యుత్ షాక్ తగిలి అక్కడిక్కడే మరణించిన ఘటన స్థానికులను షాక్‌కు గురిచేసింది. అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఓ నిండు ప్రాణం బలైంది. ప్రమాదకరంగా ఉన్న ఇనుప స్తంభాల స్థానంలో సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఉన్నప్పటికీ.. ఆ దిశలో సంబంధిత అధికారులు దృష్టి సారించడం లేదు. దీంతో అప్పుడప్పుడు ఇలా బహదూర్‌పురాలో జరిగిన సంఘటనలు పునరావతం అవుతున్నాయి. దీనికి తోడు అడ్డదిడ్డంగా ఉన్న విద్యుత్ వైర్లు, సర్వీస్ వైర్లు శిథిలావస్థకు చేరుకున్నా.. సంబంధిత అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయి పరిశీలన చేయకపోవడంతో ప్రమాదాలు పొంచి ఉంటున్నాయి.

ఎయిర్ బంచ్ కేబుల్ ఏమాయే..?

స్తంభాలకు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలతో అప్పుడప్పుడు విద్యుత్ సరఫరాకు కూడా అంతరాయం కలుగుతోంది. టీఎస్ఎస్‌పీడీసీఎల్ దక్షిణ మండలంలో చార్మినార్, ఆస్మాన్‌ఘడ్, బేగంబజార్ డివిజన్‌లున్నాయి. వీటి పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ వైర్లు కిందికి వేలాడుతూ.. ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఆస్మాన్‌ఘడ్ విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని ఆస్మాన్‌ఘడ్, గాంధీనగర్, హమాలీబస్తీ, ఎస్టీ కాలనీ తదితర బస్తీల్లో ఎన్నో ఏళ్లుగా స్థానికులు ఎల్టీ, హెచ్‌టీ విద్యుత్ వైర్లతో ప్రమాదాలు ఎదురవుతున్నాయని సంబంధిత విద్యుత్ అధికారులకు వివరించగా కేవలం ఎల్టీ విద్యుత్ వైర్ల స్థానంలో బంచ్ కేబుల్(బీసీ) వైర్లను ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంతో ప్రమాదకరంగా మారిన హెచ్‌టీ విద్యుత్ వైర్లను తొలగించకపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితి పాతబస్తీ పరిధిలోని మలక్‌పేట్, చార్మినార్, యాకుత్‌పురా, బహదూర్‌పురా, చాంద్రాయణగుట్ట తదితర నియోజకవర్గాల పరిధిలోని ఏ స్లమ్ ఏరియాలో చూసినా కనిపిస్తుంది. ప్రమాదకరంగా మారిన ఎల్టీ, హెచ్‌టీ విద్యుత్ వైర్లను తొలగించి వాటి స్థానంలో ఎయిర్ బంచ్ కేబుల్స్ వ్యవస్థను అందుబాటులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.


ఇనుప విద్యుత్ స్తంభానికి స్థానికులు ఏర్పాటు చేసిన రక్షణ కవచం

సమన్వయ లోపంతో సమస్యలు మరింత జటిలం

వీధి స్తంభాల మెయిన్‌టనెన్స్ జీహెచ్ఎంసీ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో జరుగుతుంది. వీధి స్తంభాలకు విద్యుత్ సరఫరా టీఎస్ఎస్‌పీడీసీఎల్ చేస్తుండగా..రోజు వారి పర్యవేక్షణ, వీధి దీపాల మార్పు, మరమ్మతులు అన్నీ జీహెచ్ఎంసీ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు చూస్తున్నారు. ఇటీవల ఈ మెయిన్‌టనెన్స్‌ను ఈఈఎస్ఎల్ విభాగానికి అప్పగించిన జీహెచ్ఎంసీ పర్యవేక్షణను మరచిపోయింది. ఇక టీఎస్ఎస్‌పీడీసీఎల్‌కు జీహెచ్ఎంసీ ఎలక్ట్రికల్ విభాగం అధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగా సమస్యలు మరింత జటిలమవుతున్నాయి. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయి పర్యవేక్షణ, పరిశీలన చేసి ఎప్పటికప్పుడు కింది స్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేసి అవసరమైన మేరకు మరమ్మతులు చేయిస్తే..బహదూర్‌పురాలో జరిగిన ఘటనలు రిపీట్ కాకుండా ఉంటాయని పాతబస్తీ ప్రజలు సూచిస్తున్నారు.

దానం నాగేందర్ గెలుపుతోనే సికింద్రాబాద్ అభివృద్ధి

అబిడ్స్: దానం నాగేందర్ గెలుపుతోనే సికింద్రాబాద్ పార్లమెంట్ అభివృద్ధి చెందుతుందని మాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రాం ప్రసాద్ పేర్కొన్నారు. దానం నాగేందర్‌ను గెలిపించండి..కిషన్‌రెడ్డిని ఓడించండి అనే నినాదంతో ఇంటింటికీ తిరిగి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. బత్తుల రాంప్రసాద్ మాట్లాడుతూ..ఎంపీగా ఉన్న కిషన్‌రెడ్డి ఏ ఒక్కరోజూ తమ సమస్య పరిష్కరించలేదన్నారు. కాంగ్రెస్‌తోనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అరుణ్‌కుమార్, త్యాగాల శివకుమార్, మంత్రి ముత్యాలు, భూపతి జయరాజ్, ఆదర్శ్‌కుమార్, గోనే రాకేష్, పసుల గౌతం, బత్తుల రమేష్, రాజు, గిరిబాబు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న రాంప్రసాద్ తదితరులు

మతతత్వ మజ్లిస్, బీజేపీలకు ఓటమి తప్పదు

బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్


ప్రచారం నిర్వహిస్తున్న ఆకుల శ్రీనివాస్


బైక్ ర్యాలీ నిర్వహించిన గడ్డం శ్రీనివాస్ యాదవ్


మాట్లాడుతున్న ఆనంద్‌కుమార్ గౌడ్


ప్రచారం నిర్వహిస్తున్న జగదీష్‌యాదవ్


ప్రచారం చేస్తున్న జగదీష్‌యాదవ్, కిశోర్‌కుమార్, నరహరిచారి తదితరులు

అబిడ్స్: మతతత్వ మజ్లిస్, బీజేపీలకు హైదరాబాద్ లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి తప్పదని బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. గోషామహల్ నియోజకవర్గంలోని గోషామహల్, ధూల్‌పేట, బేగంబజార్, అఫ్జల్‌గంజ్, జాంబాగ్ తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున బైకు ర్యాలీ నిర్వహించి ప్రచారం చేశారు. అనంతరం శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ..40 ఏళ్లుగా మతం పేరు చెప్పి ఓట్లు దండుకుంటున్న మజ్లిస్ పార్టీకి ఈ ఎన్నికల్లో భూస్థాపితం చేయాలన్నారు. తనను గెలిపిస్తే హైదరాబాద్‌ను సుందర నగరంగా తీరుస్తామన్నారు. కోటి శైలేష్ కురుమ, నరేందర్ యాదవ్, ప్రదీప్‌రాజ్, శ్రీనివాస్ గౌడ్, సుశీల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ రాకతోనే నీటికి, కరెంటుకు కటకట..

ఐదు నెలల కాంగ్రెస్ పాలనలో నగరవాసులకు నీటికి, కరెంటుకు కటకట మొదలైందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎమ్మెస్ ప్రభాకర్‌రావు, నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ సీహెచ్. ఆనంద్ కుమార్ గౌడ్ ఆరోపించారు. తిరిగి కేసీఆర్ ప్రభుత్వం రావాలని అన్ని వర్గాల ప్రజలు ఆకాంక్షిస్తున్నారని వారు పేర్కొన్నారు. నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభాకర్‌రావు, ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ..బీఆర్ఎస్ కార్యకర్తలు పటిష్టంగా ఉన్నారన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం..

చాంద్రాయణగుట్ట: బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ సీనియర్ నాయకుడు ఆకుల శ్రీనివాస్ అన్నారు. చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్‌యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. చెన్నయ్యగారి సరిత, టీఎమ్మార్పీఎస్ నాయకులు సాప కృష్ణ, సాయిలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలి..

లంగర్‌హౌస్: తెలంగాణలో అభివృద్ధి జరగాలంటే బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని గోల్కొండ జగదాంబిక ఆలయ కమిటీ చైర్మన్ జగదీష్ యాదవ్ అన్నారు. బీఆర్ఎస్‌కు మద్దతుగా ఆయన ఆధ్వర్యంలో లంగర్‌హౌస్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. జగదీష్ యాదవ్ మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన అభివృద్ధికి మరోసారి పట్టం కడదామన్నారు. కార్తీక్, పల్లవి, దాసు తదితరులున్నారు.

జియాగూడలో బీఆర్ఎస్ ప్రచారం..

జియాగూడ: బీఆర్ఎస్ లోక్‌సభ సీట్లను అధిక శాతం గెలుచుకుంటుందని కార్వాన్ నియోజకవర్గం నాయకుడు ఆరేల్ల జగదీష్ యాదవ్, కార్వాన్ అసెంబ్లీ యూత్ అధ్యక్షుడు మంగి కిశోర్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు బి.నరహరిచారి అన్నారు. గురువారం గడ్డం శ్రీనివాస్ యాదవ్ గెలుపు కోసం జియాగూడలోని కేశవస్వామినగర్, ఇమాంపురా, మల్లన్నగుడి తదితర ప్రాంతాల్లో ప్రచారం చేశారు. నర్సింహ, చంద్రకాంత్, దేవేందర్ సాగర్, హేమంత్, అరుణ, అనిత పాల్గొన్నారు.

నాంపల్లి సెగ్మెంట్‌లో 326057 మంది ఓటర్లు

నాంపల్లి: 08–సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని నాంపల్లి సెగ్మెంట్‌లో మొత్తం 277 పోలింగ్ బూత్‌లు ఉన్నట్లు ఎన్నికల అసిస్టెంట్ రిటరి్నంగ్ అధికారి లావణ్య పేర్కొన్నారు. మాసబ్ట్యాంక్‌లోని జేఎన్టీయూ ఫైన్ ఆర్ట్స్ వర్సిటీలోని డీఆర్సీ సెంటర్‌లో గురువారం ఆమె మాట్లాడారు. నియోజకవర్గంలో మొత్తం 326057 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. వీరిలో 166995 మంది పురుషులు, 159052 మహిళలు, 10 మంది థర్డ్ జెండర్ ఉన్నట్లు వివరించారు. ఆసిఫ్‌నగర్‌లోని ఫిల్టర్ బోర్డు పోలింగ్ కేంద్రం–1లో అత్యల్పంగా 321 మంది ఓటర్లు, గుడిమల్కాపూర్ ప్రియాకాలనీ నారాయణ హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రంలో అత్యధికంగా 1518 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఓటర్లు సాయంత్రం 6 గంటల వరకు ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉందన్నారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ

గోల్కొండ: హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి మజ్లిస్‌పై గెలవడం ఖాయమని ఆ పార్టీ టోలిచౌకీ డివిజన్ ఇన్‌చార్జి పూర్ణచందర్‌రావు అన్నారు. గురువారం బంజారా దర్వాజ వద్ద టోలిచౌకీ డివిజన్ అధ్యక్షులు బి.శ్రీకాంత్‌చారి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బూత్ ఇన్‌చార్జీలు, సీనియర్ నాయకుల పర్యవేక్షణలో ఓటరు స్లిప్పుల పంపిణీ వేగవంతం చేయాలని కోరారు.

చోరీకి యత్నించిన కేసులో వ్యక్తికి జైలు

గౌలిపురా: చోరీకి యత్నించిన కేసులో ఓ వ్యక్తికి నాంపల్లిలోని 4వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టు మెజిస్ట్రేట్ డీసీ ఉమాపతిరావు గురువారం నెల రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. షాహీన్‌నగర్ వాద్–హే–ముస్తాఫాకు చెందిన షేక్ ఉమర్ (20) భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రాడ్, మాస్క్ ధరించి దొంగతనం చేసేందుకు అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. షేక్ ఉమర్‌పై ఈ–పెట్టీ కేసు నమోదు చేసుకొని గురువారం నాంపల్లిలోని 4వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టులో హాజరు పరచగా..పూర్వపరాలను పరిశీలించిన మెజిస్ట్రేట్ డీసీ ఉమాపతిరావు నిందితుడు ఉమర్‌కు నెల రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు తప్పవు


తనిఖీల్లో పాల్గొన్న చార్మినార్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు

చార్మినార్: ఎన్నికల నియమావళికి విరుద్ధంగా మద్యం విక్రయాలు జరుగకుండా, అక్రమ పద్ధతిలో మద్యం సరఫరా జరుగకుండా చర్యలు తీసుకుంటున్నామని చార్మినార్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు తెలిపారు. ఎన్నికల కోడ్ విడుదలైనప్పటి నుంచి నెల రోజుల పాటు తనిఖీలు నిర్వహించి పలు కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. గత నెల రోజులుగా నిర్వహించిన తనిఖీలలో ఇప్పటి వరకు 15 కేసులు నమోదు చేయగా..15 మంది నిందితులను అరెస్టు చేశామని.. రూ.55,407 విలువ గల 50.37 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. 12 మంది అనుమానిత వ్యక్తులను బైండోవర్ చేసినట్లు ఆయన తెలిపారు. అలాగే జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 11వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి 13వ తేదీ పోలింగ్ ముగిసేంత వరకు మద్యం విక్రయాలుండవన్నారు. తమ పరిధిలోని వైన్స్, బార్స్ అండ్ రెస్టారెంట్స్, కల్లుదుకాణాలు ఈ నిబంధనలు పాటించాలని..లేనిచో కేసులు తప్పవన్నారు.

సమాజ సేవతోనే మానసిక ఆనందం


అన్నప్రసాదం పంపిణీ చేస్తున్న ఎస్ఎం.ముజీబ్ హుస్సేని

అబిడ్స్: సమాజ సేవ చేయడంలోనే మానసిక ఆనందం ఉంటుందని టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు, అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్టు చైర్మన్ డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. గురువారం మెహిదీపట్నం నవాబ్ జంగ్ కేన్సర్ ఆసుపత్రిలో దాదాపు 600 మంది రోగుల సహాయకులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ప్రతినెలా ఈ సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కె.ఆర్.రాజ్‌కుమార్, కుర్రాడి శ్రీనివాస్, వైదిక్ శాస్త్రి, బొలిగిద్ద శంకర్, శ్రీధర్ నాయుడు, ఏపీఆర్‌ఓ మహ్మద్ వహీద్, మొహ్మద్ ముస్తఫా షరీఫ్, హబీబ్ చావూస్, ఆసుపత్రి యూనిట్ సభ్యులు చంద్రశేఖర్, జూనియర్ శివ, ఉస్మాన్ అలీ ఉస్మాని, మరియు రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధర్మ పరిరక్షణలో మహారాణా ప్రతాప్ కృషి ఎనలేనిది


జయంతి వేడుకల్లో పాల్గొన్న రాజ్‌కిశోర్ ఠాకూర్ తదితరులు

సుల్తాన్‌బజార్: ధర్మాన్ని పరిరక్షించడానికి మహారాణాప్రతాప్ కృషి ఎనలేనిదని బుందేలి రాజ్‌పుత్ సంఘం అధ్యక్షుడు కమల్ సింగ్ ఠాగూర్ అన్నారు. గురువారం బుందేలి రాజ్‌పుత్ వెల్ఫేర్ అసోసియేషన్, తెలంగాణ బుందేలి ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో కోఠిలోని అస్మత్‌గంజ్‌లో మహారాణా ప్రతాప్ 484వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మహారాణాప్రతాప్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కమల్‌సింగ్ ఠాకూర్, ఉమేష్ సింగ్, రంజిత్‌సింగ్, గోవింద్‌రాతిలు పలువురిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాజ్‌కిశోర్ ఠాకూర్, శైలేందర్ సింగ్, రాజన్ సింగ్, గణేష్ సింగ్, గోపాల్ సింగ్, గజేంద్ర సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలంతా మజ్లిస్ వైపే: ఎమ్మెల్యే కౌసర్


మజ్లిస్ నాయకులు, స్థానికులతో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ప్రజలంతా మజ్లిస్ వైపే ఉన్నారని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. గురువారం గోల్కొండ చోటాబజార్‌లో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్క మజ్లిస్ నాయకుడు, కార్యకర్త అసదుద్దీన్ ఒవైసీని భారీ మెజార్టీతో గెలిపించడానికి కృషి చేయాలన్నారు. అనంతరం ఆయన చోటా బజార్‌లో జరిగిన కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్నారు. మజ్లిస్ పార్టీ ప్రజల కోసమే పుట్టి ప్రజల కోసమే పని చేస్తూ ప్రజల వెంటే ఉంటూ వస్తుందన్నారు. కార్పొరేటర్ నసీరుద్దీన్, బిహార్ రాష్ట్ర మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు అక్తర్ ఉల్ హిమాన్, ఏకే పటాన్, అబీబ్ చౌస్ తదితరులున్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో మతతత్వ బీజేపీని ఓడించాలి

జియాగూడ: ఈ లోక్‌సభ ఎన్నికల్లో మతతత్వ బీజేపీ పార్టీని ఓడించాలని కార్వాన్ నియోజకవర్గ ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్ కోరారు. గురువారం జియాగూడ, కార్వాన్‌లోని సబ్జి మండి, ముస్తయిద్‌పురా, పంచ్‌బై అలావా, గిరికపల్లి, పటేల్ హోటల్ తదితర ప్రాంతాల్లో హైదరాబాద్ లోక్‌సభ ఎంఐఎం అభ్యర్థి అసదుద్దీన్ ఓవైసీ గెలుపుకోసం ఆయన విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్యులర్ భావాలు గల ఎంఐఎం పార్టీకి ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. హిందూ, ముస్లిం ఐక్యత కోసం ఎంఐఎం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, నాయకుడు గజ్జి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్వాన్‌లో 'కారు' ఖాళీ..!

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ కనుమరుగు అయిందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పదేళ్లుగా రాష్ట్రంలో అధికారం చలాయించిన బీఆర్ఎస్ పార్టీ ప్రస్తుతం కార్వాన్‌లో పూర్తిగా చతికిల పడిపోయింది. అధికారంలో ఉన్న సమయంలో కార్వాన్‌లో ఓ వెలుగు వెలిగిన నాయకులు, బీఆర్ఎస్ తరఫున పోటీ చేసిన వారు, కార్పొరేటర్‌గా ఎన్నికైన వారు ఒకొక్కరుగా పార్టీకి రాజీనామా చేశారు. అదే విధంగా గుడిమల్కాపూర్ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఆ పార్టీ తరఫున కార్పొరేటర్‌గా గెలిచాడు. ఈయన సైతం పార్టీ జంప్ చేయడానికి పడరాని పాట్లు పడుతున్నాడు. అయితే కార్వాన్‌లో మాత్రం బీఆర్ఎస్‌కు నాయకులు, కార్యకర్తలే కరువయ్యారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే కార్వాన్‌లో ఆ పార్టీ అభ్యర్థి ఎవరో చాలా మంది ఓటర్లకు ఇప్పటికీ తెలియదు. ఎన్నికల తేదీ సమీపిస్తున్నా ఆ పార్టీ అభ్యర్థి కార్వాన్ నియోజకవర్గంలో పర్యటించకపోవడంపై పలువురు విభిన్న అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

కులమతాలకు అతీతంగా అభివృద్ధి చేస్తాం


ఎన్నికల ప్రచారంలో మహ్మద్ అబ్దుల్ కవి అబ్బాసీ

చార్మినార్: సెక్యులర్ పార్టీ అయిన తమ పార్టీని గెలిపిస్తే.. ఆశించిన స్థాయిలో అభివృద్ధి చేస్తామని ఏఐఎంఐఎం ఇంక్విలాబ్ పార్టీ అధికార ప్రతినిధి, చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి మహ్మద్ అబ్దుల్ కవి అబ్బాసీ అన్నారు. గురువారం ఆయన మొఘల్‌పురాలో విలేకర్లతో మాట్లాడుతూ.. తమ పార్టీని గెలిపిస్తే..కులమతాలకు అతీతంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు మార్పు కోరుకుంటున్నారన్నారు. ప్రధాన పార్టీ అభ్యర్థులకు ధీటుగా తాను ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నానన్నారు.

సామాజిక సేవలో స్వచ్ఛంద సంస్థలు ముందుండాలి


రికాబ్‌గంజ్‌లో మజ్జిగ పంపిణీ చేస్తున్న పంకజ్‌కుమార్ అగర్వాల్

చార్మినార్: సామాజిక సేవా కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థలు ముందుండాలని హైదరాబాద్ కుంభ మేళా అగర్వాల్ సమితి, అశోక్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పంకజ్‌కుమార్ అగర్వాల్ అన్నారు. గురువారం పాతబస్తీ రికాబ్‌గంజ్‌లో ఆయన స్థానికులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగించారు. ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు పేదలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలన్నారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి



సంతోష్‌నగర్: అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన ఐ.ఎస్.సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటరామయ్య తెలిపిన వివరాల ప్రకారం... చంపాపేట్ వైశాలినగర్ ప్రాంతానికి చెందిన భరణి కుమార్ (45), వాణి దంపతులు. భరణి కుమార్ ప్రైవేటు ఉద్యోగి. వీరికి ఒక బాబు ఉన్నాడు. కొన్ని నెలల క్రితం భరణి కుమార్‌కు ఉద్యోగం పోవడంతో మద్యానికి బానిసయ్యాడు. ఇటీవల ఆర్థిక ఇబ్బందుల కారణంగా దంపతుల మధ్య గొడవలు జరిగాయి. ఈ నేపథ్యంలోనే భరణి కుమార్ తన ఎడమ చేయి మణికట్టును కోసుకొని నిలోఫర్ ఆసుపత్రిలో ఉన్న భార్య వాణికి గత నెల 30న వాట్సాప్‌లో వీడియో పంపాడు. అప్పటి నుంచి బయటకు వెళ్లిన భరణికుమార్ గురువారం ఉదయం వినయ్‌నగర్ కాలనీలోని ఫుట్‌పాత్‌పై అపస్మారకస్థితిలో పడి ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు భరణికుమార్‌ను పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. భరణి కుమార్ చేతి మణికట్టుపై బ్లేడ్‌తో కోసుకున్నట్లు గుర్తించిన పోలీసులు ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీనిపై భరణి కుమార్ సోదరుడు రవికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.